RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 120 | మే 28 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 120 | May 28 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

2

## త్వరలోనే లబ్ధిదారులకు

# ఇళ్ల పంపిణీ చేస్తాం

### కేటీఆర్ సవాల్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘాటు కౌంటర్



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు ఒక లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ చివరి నాటికి మరో లక్ష ఇళ్లను పూర్తి చేయడానికి యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) పరిధిలో స్థలాల లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ, పేదల నివాసాల కోసం అత్యంత విలువైన ప్రభుత్వ భూములను కేటాయించి, తొలి విడతగా 18 వేల ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. రాజధాని నగరంలో మొత్తంగా లక్ష ఇళ్లను అందించాలనే సంకల్పంతో క్షేత్రస్థాయిలో 13 అనువైన నివాసయోగ్య ప్రదేశాలను పరిశీలించామని చెప్పారు. లబ్ధిదారులైన పేద కుటుంబాల సూచనలకు అనుగుణంగానే ఈ గృహాలను నిర్మిస్తున్నామని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకోకుండా ఉచితంగా మహిళల పేరు మీదనే వీటిని నమోదు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి కనీసం పది ఇళ్లు కూడా కట్టించలేకపోయిందని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలోనే రెండో విడత కింద మరో 2 వేల

➤ మిగతా 2వ పేజీలో..

## కల్లాల వద్ద రైతుల దీనావస్థకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

### నష్టపోయిన వారిని ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్




**హైదరాబాద్ జనసంఘర్షణ**
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, బలమైన ఈదురు గాలుల కారణంగా వివిధ వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన వరి, మొక్కజొన్న వంటి పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కురిసిన అకస్మాత్తు వర్షాలకు వడ్ల కుప్పలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుంటే అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన చెందారు. కరెంటు సరఫరా లేకపోవడంతో చివరకు మొబైల్ ఫోన్ల వెలుతురులోనే రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రస్తుత ప్రభుత్వ అసమర్థతకు, ముందుచూపు లేనితనానికి అద్దం పడుతున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న విపరీతమైన జాప్యం వల్లే రైతుల ఆరుగాలం

➤ మిగతా 2వ పేజీలో..

## ఎండలపట్ల అప్రమత్తంగా ఉండండి

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ** దేశవ్యాప్తంగా రోజురోజుకూ ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతున్న తరుణంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ విపరీతమైన వేడి వల్ల ప్రజలు తమ దైనందిన జీవితంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని సూచిస్తూ ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా ఒక సందేశాన్ని పంచుకున్నారు.

➤ మిగతా 2వ పేజీలో..

## శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో

# ఆభరణాల మాయం

### కేరళ డీజీపీ నివేదికతో భక్తుల్లో ఆందోళన

**తిరువనంతపురం జనసంఘర్షణ**
ప్రపంచప్రసిద్ధి గాంచిన కేరళలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో అత్యంత విలువైన బంగారం, వజ్రాల ఆభరణాలు కనిపించకుండా

➤ మిగతా 2వ పేజీలో..

# ఎబోలా అనుమానం..

- బెంగళూరులో ఆఫ్రికా మహిళకు ముందస్తు వైద్య పరీక్షలు
- ఎబోలా అనుమానంతో ఐసోలేషన్‌కు తరలింపు




**బెంగుళూరు జనసంఘర్షణ**
ఆఫ్రికా ఖండంలో ఎబోలా వైరస్ కలకలం రేపుతున్న నేపథ్యంలో, కర్ణాటక రాజధాని బెంగళూరులో ఒక ముందస్తు అప్రమత్తత ఘటన వెలుగుచూసింది. ఉగాండా దేశానికి చెందిన ఒక 28 ఏళ్ల యువతి ఇటీవల బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయ సిబ్బంది నిర్వహించే సాధారణ ఆరోగ్య తనిఖీల్లో (స్క్రీనింగ్) భాగంగా, ఆమెలో అలసట, ఒళ్లు నొప్పులు వంటి కొన్ని ప్రాథమిక లక్షణాలను అధికారులు గమనించారు. ఎబోలా ప్రభావిత ప్రాంతం నుండి రావడం వల్ల, వైద్య సిబ్బంది ఎటువంటి రిస్క్ తీసుకోకుండా తక్షణమే అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఆమెను ఇందిరానగర్‌లోని ప్రభుత్వ అంటువ్యాధుల ఆసుపత్రికి తరలించి, ప్రత్యేక నిఘా విభాగం (ఐసోలేషన్)లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమెకు ఎబోలా సోకినట్లు ఎలాంటి నిర్ధారణ కాలేదని, కేవలం అనుమానంతోనే

➤ మిగతా 2వ పేజీలో..

## పాక్ మధ్యవర్తిత్వంపై సెనెటర్ తీవ్ర అభ్యంతరం

**ఇస్లామాబాద్ గరుడ ధాత్రి**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిగా వ్యవహరించడంపై అమెరికా సీనియర్ సెనెటర్ లిండ్సే గ్రాహం తీవ్ర అసంతృప్తి, అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్ ఈ చర్చల్లో భాగస్వామి కావడమే ఒక పెద్ద సమస్యగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌తో పాకిస్థాన్‌కు ఉన్న దీర్ఘకాలిక శత్రుత్వ వైఖరి కారణంగా, ఆ దేశం ఈ చర్చల్లో నిష్పాక్షికంగా వ్యవహరించడం సాధ్యం కాదని గ్రాహం స్పష్టం చేశారు. ఇరాన్‌తో శాంతియుత సంబంధాల కోసం చర్చలు జరుపుతున్న దేశాలన్నీ అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఒప్పందంలో చేరే ప్రసక్తే లేదంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ముందే తేల్చిచెప్పారు. ఈ నిర్ణయంపై సెనెటర్ గ్రాహం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ఉనికిని వ్యతిరేకించే ఒక దేశం, ఇలాంటి కీలక చర్చల్లో మధ్యవర్తిత్వం వహించడం వల్ల సమస్యలు మరింత జటిలమవుతాయని ఆయన హెచ్చరించారు.
ఇజ్రాయెల్‌పై పాకిస్థాన్ మొదటి నుంచీ ద్వేషపూరిత ధోరణినే అవలంబిస్తోందని, గతంలో పాక్ ఉన్నతాధికారులు చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని గ్రాహం గుర్తుచేశారు.

➤ మిగతా 2వ పేజీలో..

## తెలంగాణను ముంచెత్తిన అకాల వర్షాలు: చల్లబడిన వాతావరణం..

### కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**
కండలు కరిగే వేసవి ఎండలతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలకు అకాల వర్షాలు వాతావరణ పరంగా ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ, ఆరుగాలం శ్రమించిన రైతాంగానికి మాత్రం తీరని శోకాన్ని మిగిల్చాయి. మంగళవారం అర్ధరాత్రి నుండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు మరియు బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ అకస్మాత్తు పరిణామంతో సిద్దిపేట జిల్లా ముత్యాలలో అత్యధికంగా 12.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా,

➤ మిగతా 2వ పేజీలో..

## త్వరలోనే లబ్దిదారులకు ఇళ్ల పంపిణీ చేస్తాం

**మొదటిపేజీ తరువాయి..** ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. ఇదే సమయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ విసిరిన సవాల్‌పై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న కేటీఆర్ వ్యాఖ్యలకు పొంగులేటి ట్విట్టర్ మరియు మీడియా వేదికగా చురకలంటించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే తాము ఎక్కువ ఇళ్లను నిర్మించి చూపిస్తామని, ఒకవేళ అలా కట్టలేకపోతే వచ్చే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని భీష్మించుకున్నారు. ఒకవేళ తాము చెప్పినట్లు అంతకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కేటీఆర్ రాజకీయ పోటీకి దూరంగా ఉంటారా అంటూ ఎదురు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఇప్పటికే హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని, జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సీఎం శ్రీకారం చుట్టబోతున్నారని వివరించారు. అధికారంలోకి వచ్చిన మొదటి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లను పూర్తి చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఫార్మ్‌హౌస్‌లకే పరిమితమయ్యే వారికి క్షేత్రస్థాయిలో ఇళ్లు కట్టుకున్న కుటుంబాల ఆనందం ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల నుండి నిన్నమొన్నటి వరకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నందున కేటీఆర్ ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనవసరం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## కల్లాల వద్ద రైతుల దీనావస్థకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

**మొదటిపేజీ తరువాయి..** కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి ధైర్యం చెప్పి, అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ తక్షణమే క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తమ తమ పరిధిలోని మార్కెట్ యార్డులను, కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి బాధితులను పరామర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే సేకరించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. కొనుగోలు కేంద్రాలలో తడిసిన వరి, మొక్కజొన్న పంటలకు తేమ శాతం, తరుగు వంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధర (మీఎస్పీ) కల్పించి ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని, ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి తడిసిన ధాన్యపు నిల్వలను సేకరించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

-----

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం**

**ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్**

**హైదరాబాద్, మే27 :** వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# ఎబోలా అనుమానం..

**మొదటిపేజీ తరువాయి..** ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. వైరస్ ఉనికిని ఖచ్చితంగా తెలుసుకోవడానికి ఆమె నుంచి సేకరించిన రక్త నమూనాలను పుణెలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' (చీ×ఎ) పరిశోధనా కేంద్రానికి పంపించారు. దీనికి సంబంధించిన పూర్తి నివేదిక మరో రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది.

ఈ విషయంపై కర్ణాటక ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి రిత్విక్ రంజన్‌పాండే స్పందిస్తూ.. బాధిత మహిళ ప్రస్తుతం నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో క్షేమంగానే ఉన్నారని తెలిపారు. నివేదికలు వచ్చే వరకు ఆమెలో కనిపించినవి ఎబోలా లక్షణాలేనని ఖచ్చితంగా చెప్పలేమని ఆయన పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కూడా ఈ ఘటనపై స్పందించింది. ప్రస్తుతం భారతదేశంలో ఎబోలా కేసులేవీ నమోదు కాలేదని, అంతర్జాతీయంగా వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్ పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని వెల్లడించింది. ప్రయాణికురాలి ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగానే ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు భరోసా ఇచ్చారు.

## పాక్ మధ్యవర్తిత్వంపై సెనెటర్ తీవ్ర అభ్యంతరం

**మొదటిపేజీ తరువాయి..** ట్రంప్ ప్రతిపాదించిన అబ్రహం ఒప్పందాలపై పాకిస్థాన్ తన ఖచ్చితమైన వైఖరిని త్వరగా స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఇటీవల పాక్‌కు చెందిన సైనిక విమానాశ్రయాల్లో ఇరాన్ యుద్ధ విమానాలు ఉన్నట్లు వస్తున్న వార్తలను అంత తేలిగ్గా కొట్టిపారేయలేమని, ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని సెనెటర్ గ్రాహం పేర్కొన్నారు.

## ఎండలపట్ల అప్రమత్తంగా ఉండండి

**మొదటిపేజీ తరువాయి..** ముఖ్యంగా ఎండల వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలని, అత్యవసర పనులపై బయటకు వెళ్లేవారు ఖచ్చితంగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా ఉండే మధ్యాహ్నం సమయాల్లో అనవసరంగా బయట తిరగకపోవడమే మంచిదని ప్రధాని ప్రజలకు హితవు పలికారు.

ఈ కష్టకాలంలో మానవత్వాన్ని చాటుకుంటూ దాహంతో ఉన్న వారికి నీరు అందించి ఆదుకోవాలని, ఇళ్ల ముందు మరియు వ్యాపార సముదాయాల వెలుపల మట్టికుండల్లో తాగునీటిని అందుబాటులో ఉంచాలని మోదీ పిలుపునిచ్చారు. సమాజంలో ఇప్పటికే ఇతరుల దాహం తీరుస్తున్న స్వచ్ఛంద శక్తులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు, అలాగే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వేసవి ముప్పు నుంచి తప్పించుకోవడానికి నిపుణులు సూచించే ఆరోగ్య నియమాలను పాటిస్తూ, ప్రజలందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

### శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో

## ఆభరణాల మాయం

ఆలయ భద్రతపై అనేక సందేహాలను లేవనెత్తుతూ స్వయంగా కేరళ రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ) హోంశాఖ కార్యదర్శికి ఒక అంతర్గత నివేదికను సమర్పించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ నివేదికలోని వివరాల ప్రకారం.. స్వామివారికి చెందిన దాదాపు 78 గ్రాముల బరువైన స్వర్ణ, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. ఇందులో అత్యంత విలువైందిగా భావించే 'వైరమ్ నామం' అనే వజ్రాల ఆభరణం కూడా ఉండటం గమనార్హం. ఆలయ అధికారిక రికార్డులను పరిశీలిస్తే, కొన్ని నెలల క్రితం ఈ వజ్రాల నామాన్ని కేవలం మరమ్మతుల నిమిత్తం బయటకు తీసుకెళ్లారని, అయితే ఆ తర్వాత దానిని తిరిగి ఆలయానికి తీసుకువచ్చి భద్రపరచలేదని స్పష్టమవుతోంది. దీనితో పాటు సుమారు ఆరు నెలల క్రితం బాహ్య ప్రపంచానికి తరలించిన ఒక పురాతన బంగారు దీపం కూడా ప్రస్తుతం ఎక్కడుందో తెలియకుండా పోయింది.

ఈ వరుస పరిణామాలు ఆలయంలో ప్రస్తుతం అమలవుతున్న భద్రతా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతున్నాయని డీజీపీ తన నివేదికలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఆలస్యం చేయకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి, ఆలయ రక్షణ వలయాన్ని మరింత పటిష్ఠం చేయాలని హోంశాఖ సెక్రటరీని కోరారు. అనంత పద్మనాభస్వామి వారి అమూల్యమైన ఆభరణాల రక్షణ కోసం ఆయన కొన్ని కీలక ప్రతిపాదనలు కూడా చేశారు. ఆలయంలోని ప్రతీ చిన్న బంగారు, వెండి వస్తువును అత్యంత సురక్షితమైన ఖజానా గదుల్లోకి మార్చాలని, సరైన తనిఖీలు మరియు గుర్తింపు కార్డులు లేకుండా ఏ ఒక్కరినీ లోపలికి రానివ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే భక్తులు సమర్పించే విలువైన కానుకలను ఎప్పటికప్పుడు ప్రత్యేక లాకర్లలో భద్రపరచాలని సూచించారు. శతాబ్దాల నాటి స్వామివారి దివ్య సంపద నిర్వహణలో ఇలాంటి ఘోర నిర్లక్ష్యం వహించడంపై భక్తులు, ఆధ్యాత్మిక సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## తెలంగాణను ముంచెత్తిన అకాల వర్షాలు: చల్లబడిన వాతావరణం..

**మొదటిపేజీ తరువాయి..** పెద్దపల్లి వంటి జిల్లాల్లో పెద్ద ఎత్తున చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రవాణా మార్గాలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా, చాలా ప్రాంతాలు చీకట్లోనే ఉండిపోయాయి. పిడుగుపాట్లు సంభవించే ప్రమాదం ఉందంటూ వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రజలను హెచ్చరించింది.

ఈ వర్షాల కారణంగా కామారెడ్డి, మెదక్ సహా పలు జిల్లాల్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం భారీగా తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల బస్తాల్లో నింపిన ధాన్యం పూర్తిగా నాణిపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని, సకాలంలో కొనుగోళు జరిపి ఉంటే తమకు ఈ నష్టం వచ్చేది కాదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో నెలల తరబడి గన్నీ సంచుల కొరత వేధించడం, తరుగు పేరుతో మిల్లుల యజమానులు దోపిడీకి పాల్పడటం, కాంటాలు పూర్తయిన తర్వాత కూడా లారీల కొరతతో లోడింగ్ ఆలస్యం కావడం వంటి కారణాల వల్ల ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయిందని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. అప్పులు తెచ్చి, రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంట కళ్ల ముందే పాడైపోతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి, తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరకే కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు.

## వేటకొడవళ్ల నుంచి గొడ్డళ్ల వరకు వైసిపి ప్రస్థానం

**ఐటి నుంచి క్వాంటం వరకు మారడం మన విధానం**

**బోత్ ఆర్ నాట్ సేమ్. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్**

**మహానాడులో చంద్రాబు ఉద్వేగ ప్రసంగం**

**అమరావతి, మే27 :**
మహానాడు వేదికగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఘాటు విమర్శలు చేశారు. 'వేట కొడవళ్ల నుంచి గొడ్డళ్లకు మారడం వైసీపీ విధానం... ఐటీ నుంచి క్వాంటం వరకు మారడం మన విధానం... బోత్ ఆర్ నాట్ సేమ్. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అంటూ వైసీపీపై తీవ్రస్థాయిలో
విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లు రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితులే 'క్రూయల్ మెంటాలిటీ'కి ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఏపీ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ క్లీన్ చేశామని... డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ చేస్తున్నామని తెలిపారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని, ఆస్తుల భద్రత కోసం ప్రతి ఒక్కరికీ క్యూ ఆర్ కోడ్‌తో బ్లాక్‌చైన్ టెక్నాలజీ అమలు చేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ పరిణామాలు కూడా రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో యుద్ధం జరిగిందని... ఏపీలో గ్యాస్ సమస్య వచ్చిందని ప్రస్తావించారు. ఆక్వా, అరటికి రేట్లు పడిపోయాయని చెప్పారు. సంక్షేమాన్ని అవకాశంగా మార్చి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నామని వివరించారు. యువతకు కావాల్సింది గొడ్డలి వేటు కాదని... ఉద్యోగాలని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీ ముసుగులో 'గొడ్డలి పార్టీ' వచ్చిందని విమర్శించారు. 'ఐటీ నుంచి క్వాంటంకు మారడం మన నినాదం' అంటూ టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిపైనే తమ దృష్టి అని తెలిపారు. పార్టీ కేడర్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులకు సూచించారు. కేడర్‌ను గౌరవంగా చూసుకోవాలని... ఏ నాయకుడైనా కేడర్‌ను ఇగ్నోర్ చేయడానికి వీల్లేదని హెచ్చరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో ఉండే ప్రతి కార్యకర్త నాయకుడే... తయారు చేయాల్సింది అనుచరులను కాదు, నాయకులను అంటూ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి సంజీవని ఇచ్చాం... మైహెల్త్ యాప్ తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి కార్యకర్త ఆరోగ్యాన్ని పార్టీ మానిటర్ చేస్తుందని అన్నారు. పార్టీ అధినేతగా కార్యకర్తల కుటుంబ సభ్యుల సర్వతోముఖాభివృద్ధికి కూడా తనదే బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 'నాయకులను గౌరవిస్తాం... కానీ మీ పరిధిలో గెలవకపోతే మీకో దండం పెడతాం' అంటూ హెచ్చరించారు. మిత్రపక్షాలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. 'ఇగోలకు పోవద్దు... అహంకారం తగదు. మన కార్యకర్తకు ఇచ్చే గౌరవమే మనకు శ్రీరామరక్ష' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం: ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)

ఇల్లందు పురపాలక కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సోదరీమణులకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరి ఆశీర్వాదంతోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం మూడు రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించి మాట నిలబెట్టుకున్నామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టినప్పటికీ, తాము మాత్రం వెనకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఉచిత విద్యుత్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలను విజయవంతంగా అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వానికి, తమ ప్రజా ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తాము ఎన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నా ఎలాంటి హంగు ఆర్భాటాలు, పబ్లిసిటీ లేకుండా కేవలం పేదల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. వచ్చే నెలలో అర్హులైన పేదలందరికీ పెన్షన్లతో పాటు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేయబోతున్నామని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పురపాలక చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, హసీనా, పర్రె స్వర్ణలత, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

- రజక, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు కంచర్ల శ్రీనివాసరావు
- అనాథ పిల్లలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ: కంచర్ల శ్రీనివాసరావు అద్భుతమైన సేవా నిరతి
- 30 ఏళ్ల విదేశీ అనుభవంతో అనాథలకు ఉచిత శిక్షణ: ఇల్లందులో కంచర్ల వినూత్న సేవ
- ఇల్లందు ప్రయోజనాలే ధ్యేయం: రైల్వే స్టేషన్ సాధనకై పోరాటానికి సై అంటున్న కంచర్ల
- తండ్రికి తగ్గ తనయులు.. దేశ, సమాజ సేవలో కంచర్ల శ్రీనివాసరావు కుటుంబం ఆదర్శం





ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)

గోమాతను కేంద్ర ప్రభుత్వం తక్షణమే 'జాతీయ జంతువు'గా ప్రకటించాలని, ఆవుల సంరక్షణ విషయంలో కేంద్రం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఇల్లందుకు చెందిన ప్రముఖ రజక సంఘం రాష్ట్ర నాయకుడు, బీసీ కులాల రాష్ట్ర నాయకుడు మరియు మూగజీవాల ప్రేమికుడు కంచర్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎండ తీవ్రతకు అల్లాడుతున్న పశువులు, పక్షులు వంటి మూగజీవాలకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆహారం, తాగునీరు అందించి ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే కంచర్ల శ్రీనివాసరావు తన డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఒక అద్భుతమైన ఉచిత సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమాజంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను ఆదుకోవాలనే లక్ష్యంతో, 19 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇస్తానని ఆయన ఉదారంగా ప్రకటించారు. శ్రీనివాసరావుకు డ్రైవింగ్ రంగంలో అపారమైన అనుభవం ఉంది. గతంలో ఆయన విదేశాల్లో దాదాపు 30 సంవత్సరాల పాటు డ్రైవింగ్ రంగంలో సేవలందించారు. ఆ సుదీర్ఘ అనుభవంతో ఇప్పటికే కొన్ని వందల మందికి డ్రైవింగ్ లో పక్కాగా శిక్షణ ఇవ్వడమే కాకుండా, రోడ్డు భద్రత, డ్రైవింగ్ లోని కీలక మెలుకువలను నేర్పించి ఎందరినో ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దారు. అర్హులైన అనాథ యువతీ యువకులు ఈ ఉచిత డ్రైవింగ్ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణ పొందాలనుకునే వారు, మరిన్ని వివరాల కోసం తన వ్యక్తిగత మొబైల్ నెంబర్ 98493 78766 లో నేరుగా సంప్రదించవచ్చని శ్రీనివాసరావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కంచర్ల శ్రీనివాసరావు కుటుంబం కూడా సమాజ సేవలో, దేశ సేవలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, వారిలో ఒకరు దేశ రక్షణే ధ్యేయంగా సిఐఎస్ఎఫ్ లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ దేశానికి సేవ చేస్తున్నారు. శ్రీనివాసరావు పెంపకంలో పెరిగిన కుమారులు ఇద్దరూ ఉన్నత విలువలతో రాణిస్తున్నారు. ఆయన రెండవ కుమారుడు కంచర్ల మధుసూదన్ ప్రస్తుతం సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగం చేస్తున్నారు. మధుసూదన్ తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా, ఉద్యోగం చేసుకుంటూనే తండ్రి లాగే సమాజ హితం కోరే పలు సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొంటూ ఇల్లందు ప్రాంతంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. దేశ సేవలో ఒక కుమారుడు, సామాజిక సేవలో మరొక కుమారుడు భాగస్వాములు కావడం పట్ల స్థానికులు కంచర్ల శ్రీనివాసరావు కుటుంబంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తండ్రికి తగ్గ తనయులుగా ఇద్దరు కొడుకులు బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇల్లందు ప్రాంత ప్రయోజనాల కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాడేందుకు కంచర్ల శ్రీనివాసరావు సిద్ధమవుతున్నారు. ఇల్లందు రైల్వే స్టేషన్ పునరుద్ధరణ, అభివృద్ధి కోసం రానున్న రోజుల్లో అవసరమైతే నిరాహార దీక్ష చేయడానికి కూడా తాను వెనుకాడబోనని, ఈ మేరకు పూర్తి కార్యాచరణతో ఆలోచన చేస్తున్నానని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్

- మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్
- యువతను గంజాయి బారి నుంచి కాపాడటం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత: ఎస్పీ డా. శబరీష్
- గంజాయి సమాచారం ఉంటే '8712656999' నంబర్‌కు తెలపండి
- రాత్రి పహారా పెంచండి.. లాడ్జీలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉంచండి
- గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి
- ఎండ తీవ్రత దృష్ట్యా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు జాగ్రత్తలు వహించాలి

మహబూబాబాద్ మే 27 (జన సంఘర్షణ)

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ బుధవారం మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసింగ్ విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా సాగిన ఈ తనిఖీల్లో ఆయన స్టేషన్ పరిసరాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది విధులను ఎస్పీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదే సమయంలో వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి, వారి సమస్యలను, పోలీసుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు మరింత స్నేహపూర్వక వాతావరణంలో (ఫ్రెండ్లీ పోలీసింగ్) సేవలు అందించాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. ప్రస్తుత ఎండ తీవ్రత దృష్ట్యా, దూర ప్రాంతాల నుండి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్పీ శబరీష్, యువత భవిష్యత్తును పాడుచేస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా వారిని కాపాడాల్సిన కనీస బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందంటూ కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు మరియు నేరాల నియంత్రణకు రాత్రి పహారా (నైట్ పెట్రోలింగ్) విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే తమ పరిధిలో ఉన్న హోటల్స్, లాడ్జలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, అక్కడ ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో భద్రత కోసం సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామీణ ప్రాంతాల్లో మరియు విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రజలు కూడా సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. గంజాయి విక్రయాలు, వాడకం లేదా రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే 8712656999 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ స్పష్టం చేశారు.




# సింగరేణిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు: ఘనంగా నిర్వహించాలని జీఎం కృష్ణయ్య ఆదేశం

ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)



సింగరేణి వ్యాప్తంగా జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని జీఎం కృష్ణయ్య అధికారులను గట్టిగా ఆదేశించారు. తన చాంబర్‌లో గనులు, అన్ని విభాగాల అధిపతులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆయన ఈ విషయాలను స్పష్టం చేశారు. పండుగ వాతావరణం ఉట్టిపడేలా ప్లాన్ చేయాలని రూట్ మ్యాప్ ఇచ్చారు. ఆ రోజున సింగరేణి పరిధిలోని అన్ని గనులు, ఏరియా ఆఫీసుల్లో జాతీయ జెండాలను సగర్వంగా ఎగురవేయాలని జీఎం సూచించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేడుకలు పక్కాగా జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇక వేడుకల కోసం గనుల పరిసరాలన్నింటినీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని ఆర్డర్ వేశారు. సింగరేణి ప్రాంతమంతా తెలంగాణ సంబరాలతో కళకళలాడాలని, ఇందుకోసం అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లలో స్పీడ్ పెంచాలని స్పష్టం చేశారు.

# ఆడబిడ్డ పుట్టిన ఆనందంలో మొక్కలు నాటిన దంపతులు

ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)



ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు సురక్షితమని నిరూపిస్తూ రేపల్లెవాడకు చెందిన రజిని, సుధీర్ దంపతులు ఆదర్శంగా నిలిచారు. రజిని ఇల్లందు సర్కారు దవాఖానాలో పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వడంతో ఆ కుటుంబంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకరమైన సందర్భంలో, ఆ దంపతులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటి తమ ప్రకృతి ప్రేమను చాటుకున్నారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచుతూ, పర్యావరణ పరిరక్షణకు పూనుకున్న ఈ దంపతుల వినూత్న ఆలోచనను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా అభినందించారు.

# భవనాల నిర్మాణంలో రాజీవద్దు: కలెక్టర్ అంకిత్


కొత్తగూడెం మే 27 (జన సంఘర్షణ)




జిల్లాలో మహిళా సాధికారతకు వేదికగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఇందిరా మహిళా శక్తి' భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ అంకిత్ అధికారులను గట్టిగా ఆదేశించారు. పనుల నాణ్యతపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ భవన నిర్మాణ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనుల్లో ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇవ్వడానికి, వారి నైపుణ్యాభివృద్ధికి, వారు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా ఈ భవనాలను రూపుదిద్దాలని కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు.

# సెక్టోరియల్ కో-ఆర్డినేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం మే 27 (జన సంఘర్షణ)



సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్ కో-ఆర్డినేటర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బి. నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించిందని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎంలు), అలాగే కనీసం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు అర్హులని డీఈఓ స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ సాయంత్రంలోగా తమ దరఖాస్తులను పూర్తి వివరాలు, అవసరమైన ధృవీకరణ పత్రాలతో కలిపి డీఈఓ కార్యాలయంలో నేరుగా అందజేయాలని నాగలక్ష్మి స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిశీలించబోమని ఆమె తెలిపారు.

# ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఇల్లందులో టీడీపీ వర్చువల్ మహానాడు

ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)



ఇల్లందులోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ నందు ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) వర్చువల్ మహానాడు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై లైవ్ స్క్రీనింగ్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా మహిళలకు 33 శాతం సీట్ల కేటాయింపుతో పాటు స్త్రీ శక్తి, స్త్రీ భద్రతలపై ప్రత్యేక తీర్మానాలు ప్రవేశపెట్టారు. జాతీయ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన నారా లోకేష్ ఈ మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ పార్టీని పటిష్టం చేసేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతామని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చాందావత్ రమేష్ బాబు, అజ్మీర బూలి, నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ, మనుబోతుల నర్సన్న, మైపా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

- 500 కేజీల నల్లబెల్లం, పట్టిక స్వాధీనం

నేలకొండపల్లి మే 27 (జన సంఘర్షణ)
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా అక్రమ బెల్లం రవాణా గుట్టురట్టయింది. గుంటూరు ప్రాంతం నుండి మహబూబాబాద్ జిల్లాకు నాటుసారా తయారీ ముడిపదార్థాలను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామం వద్ద ఎక్సైజ్ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టి అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వచ్చిన ఒక వాహనాన్ని ఆపి అధికారులు సోదా చేశారు. గుంటూరు నుండి మహబూబాబాద్ జిల్లా పరిసర ప్రాంతాల్లోని పలు తండాలకు నాటుసారా తయారీదారులకు సరఫరా చేసేందుకు అక్రమంగా తరలిస్తున్న పది బస్తాల నల్లబెల్లాన్ని అధికారులు గుర్తించారు. అందులో ఉన్న సుమారు 500 కేజీల బెల్లంతో పాటు, నాటుసారా తయారీలో కెమికల్‌గా ఉపయోగించే 50 కేజీల పట్టికను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనంతో పాటు, నిందితుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన రెండు సెల్ ఫోన్లను ఇతర కీలక ఆధారాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముడిపదార్థాలను ఎక్కడి నుండి కొనుగోలు చేశారు, మహబూబాబాద్ జిల్లాలో ఎవరెవరికి సరఫరా చేయాలనుకున్నారనే కోణంలో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు, వాటికి సంబంధించిన ముడిపదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా ఎక్సైజ్




అధికారులు హెచ్చరించారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, రవాణాకు ఉపయోగించే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

# వాజేడు మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పర్యటన


- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం



వాజేడు మే 27 (జన సంఘర్షణ )
భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని వాజేడు మండలంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ముందుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచే కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, అనారోగ్యంతో బాధపడి చికిత్స పొంది, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న రెండు బాధిత కుటుంబాలకు మంజూరైన చెక్కులను కూడా ఈ సందర్భంగా అందజేశారు. ఈ లబ్ధిదారుల పంపిణీ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ లీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 100 కోట్ల క్లబ్ సినిమా "హిట్ 3" లో మెరిసిన మానుకోట బిడ్డ మల్లిక్ రాజ్ వరకోటి





మహబూబాబాద్ మే 27 (జన సంఘర్షణ)
నాని కథానాయకుడిగా నటించి, వంద కోట్ల క్లబ్‌లో చేరిన సూపర్ హిట్ చిత్రం 'హిట్ 3' లో పోలీస్ ఆఫీసర్‌గా నటించి వెండితెరపై తన ప్రతిభను చాటుకున్నారు నటుడు మల్లిక్ రాజ్ వరకోటి. హనుమంతుని గడ్డకు చెందిన వరకోటి ఆగమల్లు, కొమురమ్మల పుత్రుడైన మల్లికార్జున్ యాదవ్ (మల్లిక్ రాజ్) స్వస్థలం మానుకోట. వృత్తిరీత్యా నిజ జీవితంలోనూ పోలీస్ అధికారిగా ప్రజాసేవ అందిస్తున్న ఆయన, ప్రవృత్తిగా కళారంగంపై ఉన్న మక్కువతో నటుడిగా, దర్శకుడిగా రాణిస్తూ తన ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. మల్లిక్ రాజ్ సినీ ప్రస్థానం 2016 లో ప్రారంభమైంది. ఆ సంవత్సరంలో విడుదలైన '7to4' అనే సినిమాతో ఆయన హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత నటుడిగా వెనక్కి తిరిగి చూసుకోకుండా వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఇప్పటివరకు దాదాపు 30 సినిమాల్లో వివిధ పాత్రలు పోషించడమే కాకుండా, పలు ప్రజాదరణ పొందిన టీవీ షోలు, మ్యూజిక్ ఆల్బమ్స్, మరియు వెబ్ సిరీస్‌లలో నటిస్తూ అటు వెండితెరపై, ఇటు బుల్లితెరపై నటుడిగా తనదైన ముద్ర వేశారు. ఒకవైపు బాధ్యతాయుతమైన పోలీస్ ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోవైపు నటన, దర్శకత్వంపై ఉన్న పట్టుతో అంచలంచెలుగా ఎదుగుతున్నారు మల్లిక్ రాజ్. తాజాగా "హిట్ 3" లాంటి భారీ విజయం సాధించిన చిత్రంలో కీలకమైన పోలీస్ అధికారి పాత్రలో మెరిసి ప్రేక్షకులను మెప్పించారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని మంచి పాత్రలతో, వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా, దర్శకుడిగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మానుకోట ప్రజలు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# జాతీయ జంతువు

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 27 (జన సంఘర్షణ):



ఆవును అమ్మను చేద్దాం
అమ్మకాలు బంజేసి
కసాయి యాపారం ఆపేసి
ఆవును అమ్మను చేసేద్దాం

పశువధ పేరుతో
మానవ హననం ఇంకెంతకాలం...?
ఆవును అమ్మను చేసి
అగ్రరాజ్య ఎగుమతులు ఆపేద్దాం

కులవాదం మతవాదం
పేట్రేగే హోరులో
ఆవూ ఓ ఆజ్యమేగా.
ఆవును బతికిద్దాం
అమ్మగా కొలిసేద్దాం

బతికుంటే బలుసాకన్నరు
బతకలేని రోజులా ఇవి
బొందిల పానం తీసే
మాంసాలను మానలేరా...?
కోడెలకోసం పాడెలెందుకు...?
అమ్మలకు కడుపుకోతలెందుకు...?

ఆపేద్దాం... ఆవుల కోతలు
తీర్చేద్దాం... మానవ వెతలు
ప్రకటిద్దాం ఆవును
జాతీయ జంతువుగా
కాపాడుకుందాం...
సోదర మానవాళిని
చూపిద్దాం విశ్వప్రేమను
సాదిద్దాం విశ్వశాంతిని..

**-కొండూరి. కోటిబాబు, హైకోర్టు అడ్వకేట్, ఎస్ పిటియు, హైదరాబాద్.**

# భద్రాచలంలో 'బెల్లం చాయ్' క్రేజ్..

- స్వయంగా రుచి చూసి అభినందించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- చర్ల రోడ్డులో ఎమ్మెల్యే సందడి: 'శివ రుద్ర టీ హౌస్'లో బెల్లం చాయ్ తాగిన తెల్లం వెంకట్రావు
- ఆరోగ్యానికి సంజీవని 'బెల్లం చాయ్'.. చిన్న వ్యాపారిని ప్రోత్సహించిన భద్రాచలం శాసనసభ్యులు

భద్రాచలం మే 27 (జన సంఘర్షణ)
రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా, ప్రజలతో మమేకం కావడంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఎప్పుడూ ముందే ఉంటారు. తాజాగా ఆయన చర్ల రోడ్డులో ఉన్న రాధా హాస్పిటల్ ఎదురుగా వెలిసిన ప్రసిద్ధ 'శివ రుద్ర టీ హౌస్'ను సందర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రోటోకాల్ హంగులు పక్కన పెట్టి, ఒక సామాన్యుడిలా టీ స్టాల్‌కి వెళ్లి అక్కడ వేడివేడిగా కాగుతున్న చాయ్‌ని ఆస్వాదించడం స్థానికంగా పెద్ద టాపిక్‌గా మారింది. ఈ మధ్య కాలంలో భద్రాచలం పరిసర ప్రాంతాల్లో 'శివ రుద్ర టీ హౌస్' లో దొరికే 'బెల్లం చాయ్'కి విపరీతమైన క్రేజ్ పెరిగింది. ఇక్కడి చాయ్ రుచి అద్భుతంగా ఉంటుందని విన్న ఎమ్మెల్యే, స్వయంగా ఆ రుచిని చూడాలని ఇక్కడికి వచ్చారు. కుండీలో వేడివేడిగా సర్వ్ చేసిన బెల్లం చాయ్‌ని తాగుతూ, దాని ఘుమఘుమలకు ఆయన ఫిదా అయ్యారు. అనంతరం షాపు యజమానితో కాసేపు ముచ్చటించి, ఇంత మంచి రుచిని అందిస్తున్నందుకు అభినందించారు. ఎమ్మెల్యే తమ టీ స్టాల్‌కి రావడంపై షాపు నిర్వాహకులు 'డిల్లీ సురేష్' ఆనందానికి అవధులు లేవు. ఆయన మాట్లాడుతూ.. "భద్రాచలం నియోజకవర్గ ప్రజల గుండెల్లో నిలిచిన మన శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మా చిన్న షాపుకి రావడం, మాతో కూర్చొని చాయ్ తాగడం మాకు దక్కిన పెద్ద గౌరవం. మా చేతి బెల్లం చాయ్‌ని ఆయన అంతగా మెచ్చుకోవడం మా శ్రమను మరచిపోయేలా చేసింది" అంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'బెల్లం చాయ్' గొప్పదనాన్ని




చూస్తే.. ఇది కేవలం పానీయం మాత్రమే కాదు, అద్భుతమైన ఆరోగ్య సంజీవని. పంచదారతో చేసే సాధారణ టీతో పోలిస్తే బెల్లం చాయ్ ఎంతో మేలు చేస్తుంది. బెల్లంలో ఉండే ఐరన్ కంటెంట్ రక్తహీనతను తగ్గిస్తుంది. అలాగే, ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, మినరల్స్ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. అంతేకాకుండా, తిన్న ఆహారం త్వరగా అరగడానికి, లివర్‌ను శుభ్రపరచడానికి బెల్లం చాయ్ ఎంతో తోడ్పడుతుంది. అందుకే ప్రస్తుత కాలంలో హెల్త్ కాన్షియస్ ఉన్న ప్రతి ఒక్కరూ పంచదార చాయ్‌ని పక్కన పెట్టి, బెల్లం చాయ్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకపక్క ఆరోగ్యం, మరోపక్క అల్టిమేట్ టేస్ట్ కలగలిసిన ఇలాంటి బెల్లం చాయ్‌ని ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే అక్కడికి వెళ్లడం స్థానిక వ్యాపారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# ఇల్లందు డాన్స్ మాస్టర్ సాయికి అంతర్జాతీయ స్థాయి "నాట్య కళ ప్రతిభ పురస్కారం"







ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన ప్రముఖ డాన్స్ మాస్టర్ సాయి మాస్టర్ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన 'ప్లానెట్ డి' సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన "నాట్య కళ ప్రతిభ పురస్కారం" అందుకున్నారు. హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఆదివారం (24-05-2026) సాయంత్రం ప్లానెట్ డి సంస్థ 13వ వార్షికోత్సవం సందర్భంగా, లర్న్ ఎక్స్ గ్లోబల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం, డాన్స్ కాంపిటీషన్స్ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఘనంగా అందజేశారు. 12 సంవత్సరాలుగా నృత్య రంగంలో విశేష సేవలందిస్తూ, వేలాది మంది విద్యార్థులను ఉత్తమ డాన్సర్లుగా తీర్చిదిద్దిన సాయి మాస్టర్ సేవలను గుర్తిస్తూ సంస్థ నిర్వాహకులు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సినీ దర్శకులు అభిలాష్ రెడ్డి, ప్రముఖ దర్శకులు వేణు ఉడుగుల, "రాజు వెడ్స్ రాంబాయి" చిత్ర నిర్మాత సాయిలు కంపాటి, అవార్డ్స్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ సాజిదా ఖాన్, ఆడియో ఇంజనీర్ రాజుల చేతుల మీదుగా సాయి మాస్టర్‌కు ఈ పురస్కారాన్ని అందజేయడం విశేషం. ఈ సందర్భంగా సాయి మాస్టర్ మాట్లాడుతూ... గత 12 ఏళ్లుగా తాను నృత్య కళకు చేస్తున్న సేవలను గుర్తించి, ఇంతటి ప్రతిష్టాత్మక వేదికపై సత్కరించిన ప్లానెట్ డి సంస్థ నిర్వాహకులకు, ముఖ్య అతిథులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులైన నృత్య కళాకారులను సమాజానికి అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## సైకిల్ తొక్కిన మహారాష్ట్ర సీఎం సతీమణి అమృతా ఫడణవీస్

మహారాష్ట్ర/మే 27/(జన సంఘర్షణ)
ప్రధాని మోదీ పిలుపు మేరకు ఇంధనాన్ని పొదుపుగా వాడాలని మహారాష్ట్ర సీఎం సతీమణి అమృతా ఫడణవీస్ నిర్ణయించుకున్నారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఆమె సైకిల్ తొక్కడం ప్రారంభించారు. 5-7 కిలోమీటర్ల పరిధిలోని పనులన్నింటికీ సైకిల్ పైనే వెళు తున్నట్లు ఆమె ట్వీట్ చేశారు. అర్థవంతమైన మార్పులు సాధారణ ఎంపికలతోనే మొదలవుతాయని పేర్కొంటూ సైకిల్ పై వెళ్తున్న వీడియోను ఆమె షేర్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ఇది చూసిన నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు.




## హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ప్రభుత్వ అనుమతులు లేకుండా, అక్రమంగా నడుపుతున్న ఇసుక టక్టర్ కోటగిరి ఎస్సై పట్టివేత





పోత్తంగల్/మే 27/(జన సంఘర్షణ)
కేసు యొక్క వివరాలు ఏమనగా ఈరోజు 27.05.2026 రోజున ఉదయం 07:00 గంటల సమయంలో హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ప్రభుత్వ అనుమతులు లేకుండా, అక్రమంగా ట్రాక్టర్ లో ఇసుకను లోడ్ చేసుకుని తరలిస్తున్న పుట్టి రాజు (డ్రైవర్), తండ్రి: హన్మంత్లు, వయస్సు: 28 సంవత్సరాలు, గ్రామం: హంగర్గా, అతని యజమాని పుట్టి రాజేష్, తండ్రి: కాకు రామ్, వయస్సు: 32 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, గ్రామం: హంగర్గా లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.

# ప్రమాదంలో బీబీపేట్ ఉన్న బ్రిడ్జి

బీబీపేట్, మే 27 ( జన సంఘర్షణ )





కామారెడ్డి జిల్లా మండల్ బిబిపేట్‌లో మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నర్సింలు బ్రిడ్జి విషయంలో ప్రెస్ మీట్ విడుదల చేశారు. సాయంత్రం వానకు వడగాలును వర్షానికి బ్రిడ్జి వద్ద డామేజ్ అయితున్నది కామారెడ్డి జిల్లా బిబిపేట్ మండల్‌లో గతంలో వర్షాల వల్ల బిర్జి శిథిలమై ఉన్నది తెలిసింది. కావున ఎన్నో సార్ పత్రికలు రాజకీయ నాయకులకు ప్రతి ఒక్కరికి ఈ విషయం తెలిసింది. ఈ సంవత్సరం వర్షాలు మళ్లీ బాగా కురిస్తే బ్రిడ్జి వద్ద నుంచి పోవడం ఉండదు శిథిలమై ఉన్నది కావున ప్రమాదంలో ఉన్నందున ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే హుటాహుటిన వచ్చి మళ్లీ వర్షాలు పడక ముందే కొత్తగా బ్రిడ్జిని సాక్ష్యం చేయాలని గతంలో కూడా చెప్పాము మళ్లీ కూడా చెబుతున్నాము. ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయి ఒకటే దారి ఉన్నది. కావున ప్రభుత్వం వెంటనే ఈ బ్రిడ్జి కూలిపోతే బిబిపేట్ మండల్‌కు దారి లేదు. సిద్దిపేట, సిరిసిల్ల, దుబ్బాక, రామంపేట్ తాలూకాలకు గ్రామాలకు తుజాల్పూర్ , ఇస్సానగర్, ఉప్పర్ పల్లి, యాడారం, కోనాపూర్, జనగామ, మల్కాపూర్, షేర్ బిబిపేట్ గ్రామాలకు కూలిపోయే ప్రమాదం ఉన్నది. కావున అన్ని గ్రామాలకు సంవత్సరాలు గడుస్తాయి. ఇప్పుడే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేయునది ఇట్లు గ్రామ ప్రజలు తరపున మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నరసింహులు.

## బీబీపేట: పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి


బీబీపేట్, మే 27 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఏఎస్సై టి.మధుసూదన్ రావు ఎస్సైగా పదోన్నతి పొందారు. బుధవారం ఆయన ఎస్పీ రాజేశ్ చంద్రను కలిశారు. ఎస్పీ ఆయనకు పదోన్నతి చిహ్నాలు అలంకరించి అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతులు బాధ్యతను పెంచుతాయన్నారు. సిబ్బంది రెట్టింపు ఉత్సాహం, జవాబుదారీతనంతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు.

## అందరికి నమస్కారములు, ఆహ్వానం


కోటగిరి/మే 27/(జన సంఘర్షణ)



కోటగిరి , పొతంగల్ ఉమ్మడి మండలాల ప్రజలకు పార్టీ కార్యకర్తలకు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి రామారావు 103వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ చౌరస్తా, ప్రభుత్వ ఆసుపత్రి, మిర్జాపూర్ క్యాంప్ కోటగిరిలో, రేపు తేదీ 28-05-2026 ఉదయం 9 గంటలకు నిర్వహించబడనున్న వేడుకలు, ప్రభుత్వ నిధులతో నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్ ఆసుపత్రి పక్కన ప్రారంభోత్సవ కార్యక్రమం కలదు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మన బాన్స్వాడ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొనుచున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ పెద్దలు కాసుల బాలరాజు, ఉమ్మడి జిల్లాల మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్న పాల్గొనుచున్నారు. ఉమ్మడి మండలాల ఏఎంసీ చైర్మన్ మాజీ జెడ్పిటిసి మాజీ ఎంపీపీలు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఉమ్మడి మండలాల అన్ని గ్రామాల ఎన్నుకోబడిన సర్పంచులు, ఉమ్మడి మండలాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మడి మండలాల సొసైటీ అధ్యక్షులు, ప్రజలు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు ఉమ్మడి మండలాల పత్రిక విలేకరులు పాల్గొని విజయవంతం చేయాలని, మీ ఆహ్వాన కమిటీ విన్నపము నమస్కార ఈ కార్యక్రమం ఇట్లుమిర్జాపూర్ ఆహ్వాన కమిటీ కోటగిరి పేర్కొన్నారు.

## భార్య, పిల్లలను చంపి వ్యక్తి ఆత్మహత్య

వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్/మే 27/(జన సంఘర్షణ)




వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం సల్కాలాపూర్ గ్రామంలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. తన భార్య, పిల్లలను చంపి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింహులు అనే వ్యక్తి భార్య, పిల్లలను తాళ్లతో కట్టేసి పొలంలోని సంపులో పడేసి హత్య చేశాడు. అనంతరం అతడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతులు దేవరకద్ర మండలం డొకూరుకు చెందిన వారీగా గుర్తించారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. మండలం సల్కాలాపూర్ గ్రామంలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. తన భార్య, పిల్లలను చంపి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింహులు అనే వ్యక్తి భార్య, పిల్లలను తాళ్లతో కట్టేసి పొలంలోని సంపులో పడేసి హత్య చేశాడు. అనంతరం అతడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతులు దేవరకద్ర మండలం డొకూరుకు చెందిన వారీగా గుర్తించారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# మహిళా సాధికారత, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

◆ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లందు మే 27 (జన సంఘర్షణ)

మహిళా సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఇల్లందు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన “ఇందిరా మహిళా శక్తి” చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేవలం మూడు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అనేక ఆర్థిక ఇబ్బందులు సృష్టించినప్పటికీ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తాము నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇప్పటికే ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఏలాంటి హంగూ, ఆర్భాటాలు, పబ్లిసిటీలు లేకుండా పేదల కోసం నిశ్శబ్దంగా ఈ ప్రభుత్వం సేవలందిస్తోందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నుండి నూతన పెన్షన్లు, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగిన కోటి 50 లక్షల మందికి ఐదు లక్షల రూపాయల బీమా పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా




ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజులతో పాటు ప్రముఖ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, ఇతర కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ

◆ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ ప్రతినిధి./మే 27/(జన సంఘర్షణ)

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా , సెర్ప్ ఆద్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలలో భాగంగా బాన్సువాడ పట్టణం గ్రామీణ మండలంలో గల గ్రామ సంఘాల, వార్డు సంఘాల అధ్యక్షులు, విఓఏ లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు. కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లాలోనే రెండు మండలాలకు దోమకొండ, బాన్సువాడ మండలాలకు మంజూరు అయిన మండల మహిళా సమాఖ్య సాముదాయక నిర్వహణ శిక్షణా కేంద్రాల్లో బాన్సువాడ మండలానికి మంజూరు చేయబడిన మండల మహిళా సమాఖ్య సాముదాయక నిర్వహణ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం బాన్సువాడ మండల సమాఖ్య 52 మహిళా సంఘాలకు 6 కోట్ల 13 లక్షల రూపాయల చెక్కును మహిళా సంఘాల అధ్యక్షులకు,




ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద 15 మంది లబ్ధిదారులకు మంజూరు అవగా నలుగురు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాసుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 మహిళా సంఘాలకు గాను 2 కోట్ల రూపాయల చెక్కును బాన్సువాడ పట్టణంలో 18 సంవత్సరాలు పైబడిన అర్హత కలిగిన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు




ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు కామారెడ్డి మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, ఎపీడీ విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ హయ్యామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు, గురువినయ్, రోహిత్, యండి. దావూద్, స్థానిక వార్డు కౌన్సిలర్ హకీమ్, కో-ఆప్షన్ మెంబర్ మాజీద్, బాన్సువాడ పట్టణ గ్రామీణ మండల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్ చారిత్రాత్మక ఎల్‌బీ స్టేడియంలో ‘తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ కల్చరల్ మీట్’ పునఃప్రారంభం







హైదరాబాద్/మే 27/(జన సంఘర్షణ)

14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్ చారిత్రాత్మక ఎల్‌బీ స్టేడియంలో “తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ కల్చరల్ మీట్” పునఃప్రారంభం కావడం శుభపరిణామమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఈ క్రీడా వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. 2034 ఒలింపిక్స్ నిర్వహణ లక్ష్యంగా గచ్చీబౌలి క్రీడా ప్రాంగణాన్ని రూ.700 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పటిష్టమైన క్రీడా విధానాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో హైదరాబాద్‌కు ఉన్న పూర్వవైభవాన్ని తిరిగి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులంతా క్రీడాస్ఫూర్తితో పాల్గొని ‘ఫిట్ తెలంగాణ’ సందేశాన్ని చాటిచెప్పడం గర్వకారణమని పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు స్పీకర్ ముఖ్యమంత్రి, సీఎం ఉప ముఖ్యమంత్రిలు తదితరులు పాల్గొన్నారు.

# 150 ఎకరాల మామిడి తోట నష్టం.. కుటుంబం మొత్తం ఆత్మహత్య

వనపర్తి జిల్లాల/మే 27/(జన సంఘర్షణ)

వనపర్తి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఖిల్లా ఘనపురం మండలం పరిధిలోని సల్కాలాపూర్ గ్రామం లో మామిడి తోట నష్టాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మే 27, బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. డోకూరు గ్రామంకు చెందిన నర్సింహ తన భార్య పుష్పలత, 15 ఏళ్ల కుమార్తె, 17 ఏళ్ల కుమారుడితో కలిసి సల్కాలాపూర్ గ్రామంలో 150 ఎకరాల మామిడి తోటను గుత్తకు తీసుకుని సాగు చేస్తున్నారు. గత కొంతకాలంగా కుటుంబం అక్కడే నివాసం ఉంటోంది. ఈఏడాది మామిడి దిగుబడి బాగుంటుందని ఆశించిన నర్సింహకు అకాల వర్షాలు భారీ నష్టాన్ని మిగిల్చాయి. వరుస వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతినడంతో పెట్టుబడులు తిరిగి రావడం కష్టమైంది. పెద్ద మొత్తంలో అప్పులు చేసి తోటను గుత్తకు తీసుకున్న నర్సింహ అప్పులు తీర్చలేని పరిస్థితిలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఫైనాన్సర్ల ఒత్తిడి కూడా పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.





ఈక్రమంలో కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న నర్సింహ.. ముందుగా కుమార్తె, కుమారుడిని హత్య చేసి నీటి తొట్టిలో పడేశాడని సమాచారం. అనంతరం భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోవడానికి ముందు నర్సింహ సెల్ఫీ వీడియో ద్వారా తన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అప్పుల బాధతో కుటుంబం మొత్తం మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జన సంఘర్షణ
గురువారం
28 మే 2026

# దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో రూ.1.22 కోట్ల హవాలా నగదు సీజ్


**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/మే 27/(జన సంఘర్షణ)**
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో భారీగా హవాలా నగదు పట్టుబడింది. ముంబై నుంచి సికింద్రాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ.1 కోటి 22 లక్షల 70 వేల నగదును రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. మే26న ముంబై నుంచి హైదరాబాద్‌కు వస్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో బొల్లారం, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల మధ్య అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా హవాలా డబ్బు వ్యవహారం బయటపడింది. పట్టుబడిన వ్యక్తిని మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన 40 ఏళ్ల విజయ్ అంబాదాస్ గుప్తాగా గుర్తించారు. ముంబైలో "కాంత జ్యువెలరీ" నిర్వహిస్తున్న సంతోష్ సేథ్ అనే వ్యక్తి నుంచి ఈ నగదు తీసుకున్నట్లు అతడు పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఈ రూ.1.22 కోట్ల నగదును సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని "బంటి" అనే జ్యువెలరీ వ్యాపారికి అందజేయడానికి తీసుకువస్తున్నట్లు అధికారులు తెలిపారు. నగదు తరలింపుకు ప్రతిఫలంగా విజయ్‌కు రూ.5 వేల కమిషన్ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. సీజ్ చేసిన నగదుకు సంబంధించి ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






# పాములను పట్టబోయి..కాటుకు గురైన ఆమెరికా ఆరోగ్య మంత్రి

**అమెరికా/మే27/(జన సంఘర్షణ)**



అమెరికా ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ పాములను ఒట్టి చేతులతో పట్టబోయి కాటుకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఎవరు చేసే పని వారు చేస్తే బెటర్ అంటారు. కాదు కూడదని అత్యుత్సాహం ప్రదర్శిస్తే ఫలితం ప్రతికూలంగా ఉండవచ్చనడానికి అమెరికా ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ వ్యవహారమే నిదర్శనంగా కనిపిస్తుంది. అమెరికాలో ప్రముఖ డాక్టర్ ఓజ్ ఇంటిపై రెండు బ్లాక్ రేసర్ జాతి సర్పాలను కెన్నడీ పట్టుకున్నారు. అయితే పాములను పట్టుకునే క్రమంలో కెన్నడీ ఎలాంటి జాగ్రత్త చర్యలు పాటించకుండా ఒట్టి చేతులతో పాములను పట్టుకున్నాడు. ఈ ప్రయత్నంలో ఆ పాములు అతడిని పలుమార్లు కాటేశాయి. అయితే అవేవీ విషపూరితమైన పాములు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదాలపై అప్రమత్తత పాటించడంలో ఆదర్శంగా ఉండాల్సిన ఆరోగ్య మంత్రినే ఇలా దుస్సాహసంతో ముందు జాగ్రత్తలు లేకుండా పాములు పట్టడం ఏమిటన్న విమర్శలు నెటిజన్ల నుంచి వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

# తిరుమలాపూర్ చెరువులో జోరుగా మట్టి త్రవ్వకాలు







**పోతంగల్ తిరుమలాపూర్/మే 27/(జన సంఘర్షణ)**
నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం తిరుమలపూర్ గ్రామ చెరువులో ప్రతిరోజు మట్టి త్రవ్వకాలు జోరుగా జరుగుతున్నప్పటికీ దానిపై దృష్టి పెట్టకపోవడం విడ్డూరం అని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈని వివరణ కోరగా అసలు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు అదేవిధంగా అద్భుతంగా ఎమ్మార్వో వివరణ కోరగా రెండుసార్లు ఆపినప్పటికీ మట్టి త్రవ్వకాలు మాత్రం ఆపడం లేదని సమాధానం ఇవ్వడం జరిగింది, ప్రభుత్వ అనుమతులు లేవు మరోవైపు, ప్రభుత్వ ఆదానికి గండి పడే విధంగా భూగర్భ జలాలు అడుగంటి విధంగా జోరుగా మట్టి త్రవ్వకాలు చేస్తున్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నలు వర్షం కురిపిస్తున్నారు, ప్రతిరోజు మట్టి త్రవ్వకాలు జోరుగా జరుగుతున్నాయని, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అనేక సంఖ్యలో మట్టి త్రవ్వకాలు అధిక లోడుతో జరుగుతున్నప్పటికీ దీనిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# అకాల వర్షంతో నానిన ధాన్యం.. మాచారెడ్డిలో రైతుల ఆందోళన




**కామారెడ్డి /మే 27/(జన సంఘర్షణ)**
ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో దాన్యం, మొక్కజొన్న, జొన్న కొనుగోలు చేయాలంటూ పెద్ద ఎత్తున అన్నదాతలు గత నెల రోజుల నుంచి రోడెక్కి నిరసన తెలుపుతున్నప్పటికీ పాలకులు, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయింది. నెల రోజుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలంటూ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ వారు అన్నదాత గోస పట్టించుకోకపోవడంతో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధాన్యం తడిసి ముద్దయింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ ధాన్యం అంతా వర్షానికి తడిసిపోయింది అంటూ అన్నదాతలు బుధవారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇరువైపులా రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొన్నారు.కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలో రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల రైతులు ఆరబెట్టిన వడ్లు పూర్తిగా తడిసిపోయినట్లు రైతులు కంటతడి పెడుతున్నారు..దీనితో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాచారెడ్డిలో ధర్నా నిర్వహించారు. తమ కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని, ఇలాంటి కష్టాల్లో ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో మాచారెడ్డి ప్రాంతంలో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వచ్చి రైతులతో మాట్లాడి వారిని సముదాయించడంతో రైతులు తమ నిరసన విరమించారు.

# గణిత శాస్త్ర అధ్యాపకురాలు కస్ప శ్రీలతకు డాక్టరేట్

**కామారెడ్డి/మే 27/(జన సంఘర్షణ)**



కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్ ) నందు గణిత శాస్త్ర అధ్యాపకురాలుగా పని చేస్తున్న కస్ప శ్రీలత హైదరాబాద్ లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంకా శాస్త్ర విభాగం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి షేరి పర్యవేక్షణలో "నానో ద్రవాలు, హైబ్రిడ్ నానో ద్రవాలు అయస్కాంత ద్రవగతి ప్రవాహ విశ్లేషణ " అనే అంశం పై పరిశోధన చేసి, పరిశోధన గ్రంధాన్ని సమర్పించినందుకు గాను గౌరవ డాక్టరేట్ పొందడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, అధ్యాపక బృందం శ్రీలతను అభినందించారు.

# ఆర్టీఏ కార్యాలయాలపై ఏసీబీ అధికారుల సోదాలు

- హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఏసీబీ దాడులు

**హైదరాబాద్/మే27/(జన సంఘర్షణ)**




లంచాలు తీసుకోవడంలో మొదటి స్థానంలో నిలిచిన ఆర్టీఏ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు కొనసాగించారు. హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎసిబి అధికారులు ఆర్టీఏ కార్యాలయలపై ఏకకాలంలో దాడులు కొనసాగాయి. నాగోల ఆర్టీఏ కార్యాలయం, కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం, మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయం అధికారులు ముమ్మరంగ సోదాలు కొనసాగించారు. ఎం వి ఐ లు, ఏ ఎం వి ఐ లు. ఏజెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎంవీఐలు, ఏ ఎం వి ఐ లను సైతం ప్రశ్నిస్తున్న ఏసీబీ అధికారులు. ఏజెంట్ల ద్వారా కార్యకలాపాలు నడుస్తుంది అన్న సమాచారం మేరకు ఏసీబీ అధికారులు తనిఖీలు కొనసాగించారు. ఆర్టీఏ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను ప్రశ్నించిన ఎసిబి అధికారులు. ఏకకాలంలోనే ఆర్టీఏ కార్యాలయం పై దాడులు కొనసాగడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీఏ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఆర్టీఏ శాఖలో పనిచేసే కొంతమంది అధికారులు పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు తావు కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కామారెడ్డి జిల్లా మద్నూర్ చివర్లోని అంతరాష్ట్ర ఆర్టీఏ కార్యాలయంపై దాడులు చేసి అక్కడ ప్రైవేట్ వ్యక్తుల చేత డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో పలువురు ప్రైవేట్ వ్యక్తులను ఏసిబి అదుపులో తీసుకుంది. ఆర్టీఏ కార్యాలయంలో సోదాలు నిర్వహించగా కొంత నగదు పట్టుబడింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ లో ఆర్టీఏ కార్యాలయం పై హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఏసీబీ దాడులు కొనసాగాయి.

# సోంపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**పోతంగల్ మండల్ సోంపూర్/మే 27/(జన సంఘర్షణ)**





ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సోంపుర్ పోచిరాం ఆధ్వర్యంలో సోంపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పక్షాన ఉద్యమ సామాజిక నమస్కారాలు తెలియజేస్తూ ఏదైతే ఉందో ఉపాధి హామీ పథకం కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ ఎండలు ఎక్కువగా ఉండటం వలన ఉపాధి హామీ పని చేసే కూలీలకు చాలా ఇబ్బందికరమైన మండేటు ఎండలో పనిచేసే ప్రతి ఒక్క కూలీలకు అవసరమైన పద్ధతురాలు నీరు మజ్జిగ పంపిణీ వాళ్లు లేదా ఎవరైనా దాతలు లేదా గ్రామపంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు పోచీరం, గ్రామస్తులు చిన్నలు పెద్దలు ఉపాధి హామీ పని చేసే కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్పల్లిలో అమానుష ఘటన

- అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడంతో గుండెపోటుతో వృద్ధుడు మృతి
- కుటుంబ సభ్యులు రహదారిపై బైఠాయించి నిరసన

**సికింద్రాబాద్ బోయిన్పల్లి/మే 27/(జన సంఘర్షణ)**



సికింద్రాబాద్ బోయిన్పల్లి అంబేద్కర్ నగర్లో బుధవారం అమానుష ఘటన చోటుచేసుకుంది. అంబేద్కర్ కాలనీకి చెందిన పోచయ్య ( 60) వృద్ధుడు గుండెపోటుకు గురికావడంతో వెంటనే కుటుంబ సభ్యులు అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కి తరలిస్తుండగా బోయిన్పల్లి ప్రధాన రహదారిపై ఇరువైపులా కూరగాయల వాహనాలు నిలిచి ఉండడంతో అంబులెన్స్ వెళ్లడానికి రహదారి లేక గంటసేపు అంబులెన్స్ రద్దీలో ఇరుక్కుపోయింది. గంట తర్వాత రహదారిపై రాకపోకలు కొనసాగుతుండగా గంటసేపు గుండెపోటుతో విలవిలలాడిన పోచయ్య అంబులెన్స్‌లోనే మృతి చెందాడు. దీనికంతటి కారణం బోయినపల్లి ప్రధాన రహదారిపై భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోవడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని దీనివల్ల పోచయ్య మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బోయిన్పల్లి రహదారిపై వాహనాలు నిలవకుండా చూడాలంటూ ప్రజలు కోరుతున్నారు.

# గాంధీభవన్లో చొక్కాలు పట్టుకున్న కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్/మే27/(జన సంఘర్షణ)**



హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశంలో రచ్చ రచ్చ జరిగింది.గాంధీభవన్లో కాంగ్రెస్ నేతలు చొక్కాలు పట్టుకున్నారు. ఫిరోజ్ఖాఖాన్, కార్వాన్ ఉస్మాన్ అల్ హాజీల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఫిరోజఖాన్ను ఉస్మాన్ తోసేయడంతో ఫిరోజ్ కిందపడ్డారు. మంత్రి అజారుద్దీన్ పక్కన కూర్చొనే విషయంలో ఘర్షణ జరిగినట్లు సమాచారం. అయితే గొడవను అడ్డుకునే ప్రయత్నం చేసిన వీహెచ్ను కూడా తోసేనే ప్రయత్నం చేయడంతో నేతలు అడ్డుకున్నారు. కొద్దిసేపు గాంధీభవన్ రణ రంగంగా మారిపోయింది. ఎవర్ని ఎవరి కొడుతున్నారో తెలియని పరిస్థితి అక్కడ నెలకొంది. ఘర్షణ జరగడంతో మధ్యలో నుంచే మంత్రి అజారుద్దీన్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం పొన్నం ప్రభాకర్ సమావేశం పూర్తయినట్లు ప్రకటించారు.

# రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణకు శ్రీకారం

-హైడ్రా ఆధ్వర్యంలో మినీ ట్యాంక్బండ్గా అభివృద్ధి

- రూ.16 కోట్లతో ఎస్ఎన్డీపీ పనులు వేగవంతం

-హైడ్రా అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి

- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

**ఉప్పల్ :**
ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్ద చెరువును రూ.19 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో సుందరీకరించేందుకు హైడ్రా ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి వెల్లడించారు. బుధవారం హైడ్రా అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన ఆయన, చేపట్టబోయే అభివృద్ధి పనులపై స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి సుమారు రూ.150 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రామంతాపూర్ పెద్ద చెరువును హైడ్రా ద్వారా రూ.19 కోట్లతో సుందరీకరించి, వాకింగ్ ట్రాక్, ఆధునిక విద్యుత్ దీపాలు, పచ్చదనం, విశ్రాంతి ప్రదేశాలతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. చెరువును మినీ ట్యాంక్బండ్గా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ పాలనలో కాలనీలు జలమయం - ఇప్పుడు శాశ్వత పరిష్కారం**

గత బీఆర్ఎస్ పాలనలో హబ్సిగూడ ప్రాంతంలోని సెంట్ జోసెఫ్ పాఠశాల పరిసరాలు, రవీంద్ర నగర్ కాలనీ, సాయిచిత్ర నగర్, మహేశ్వరి నగర్ తదితర ప్రాంతాలు తీవ్ర ముంపునకు గురయ్యాయని పరమేశ్వర్ రెడ్డి విమర్శించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రజాప్రతినిధులు పడవలతో తిరిగిన దృశ్యాలు అందరికీ గుర్తున్నాయని అన్నారు. అయినప్పటికీ, సమస్య పరిష్కారానికి అప్పటి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వచ్చే వరద నీటిని



మళ్లించేందుకు రూ.16 కోట్ల నిధులతో ఎస్ఎన్డీపీ పనులు చేపట్టామని తెలిపారు. ఈ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో కాలనీలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

**పేదలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి - నిర్మాణాలు కూల్చబోమని హామీ**

చెరువు చుట్టూ గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు,స్థానిక కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపడతామని పరమేశ్వర్ రెడ్డి భరోసా ఇచ్చారు. చెరువు సుందరీకరణ పేరుతో ఎలాంటి నిర్మాణాలను కూల్చివేయబోమని స్పష్టం చేశారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మహేశ్వరీ నగర్,సాయి చిత్ర నగర్, రవీంద్ర నగర్ కాలనీ వాసులు. అరవింద్ రెడ్డి,బాల్



రెడ్డి,కొండల్ రెడ్డి,దామోదర్ రెడ్డి,మల్లా రెడ్డి,శ్రీధర్ రెడ్డి,అజిత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగి రెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి,డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి,హబ్సీగూడ డివిజన్ అధ్యక్షులు గన్నారం విజయ్ కుమార్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్,చింతల బాబురావు,లక్ష్మా రెడ్డి,కిషన్ నాయక్, రాజు నాయక్,మురళీ ముదిరాజ్, గుండు రాజన్న,మాలు నాయక్, ధర్మ రాజు,లక్ష్మీ నారాయణ, వాసు నాయక్, సుమన్ నాయక్, షబ్బీర్ , రామంతాపూర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు జలీల్ పాషా,ఉపేందర్ రెడ్డి, రాజీ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,గరిక సుధాకర్,పూస స్తన్న,భాస్కర్ గంగ పుత్ర,బాలయ్య బాబు, బుక్కా సురేష్,కార్పే శంకర్,కార్పే పవన్,ముత్యాల బాబు,,ముత్యాల జంగయ్య,షాగా శ్రీధర్, సందీప్, భాస్కర్,సతీష్ గౌడ్, కృష్ణ,సీమ కండ్ల జంగయ్య,బుల్లెట్ అశోక్,మిట్టు గౌడ్, ,సతి రెడ్డి, అలీమ్,రాములు,సుధాకర్, డేవిడ్,కాశమల్ల శంకర్, జి.స్వామి, కె.స్వామి,గౌతమ్,రామకృష్ణ,విజయ్,చోటా,రాజు,సలీమ్, అంబిక,రవి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, హైడ్రా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి-65పై ప్రమాదాల నివారణకు అధికారుల సంయుక్త పరిశీలన

-బ్లాక్ స్పాట్స్ వద్ద భద్రతా చర్యలపై సమీక్ష

- ఏసీపీ కూకట్పల్లి ట్రాఫిక్ కె.వెంకటయ్య



**కూకట్పల్లి :**
జాతీయ రహదారి-65 (ఎన్హెచ్-65) పరిధిలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక పరిశీలన చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్ను గుర్తించి, వాటి కారణాలను విశ్లేషించేందుకు ట్రాఫిక్, మున్సిపల్, రవాణా శాఖల అధికారులు రంగంలోకి దిగారు. ఏసీపీ కూకట్పల్లి ట్రాఫిక్ కె. వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరిశీలనలో సైబరాబాద్ మున్సిపల్ అధికారులు మౌనిక (డీఈఈ, అల్విన్ సర్కిల్), శ్రావణి (ఏఈఈ, కూకట్పల్లి సర్కిల్), రమేష్ (డీఈఈ, మూసాపేట్ సర్కిల్), మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనుబాబు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శేఖర్ రెడ్డి, ఎస్సై రామకృష్ణ, ఆర్టీఏఎం సెల్కు చెందిన పీసీ రాజు, కూకట్పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో పిల్లర్ నంబర్లు 740 నుంచి 763 వరకు, 824 నుంచి 841 వరకు, అలాగే 874 నుంచి 896 వరకు ఉన్న ప్రమాద ప్రాంతాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారి నిర్మాణ లోపాలు, అధిక ట్రాఫిక్ ఒత్తిడి, సిగ్నలింగ్ సమస్యలు, వాహనాల అతివేగం వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించి ప్రమాదాలకు దారితీసే కారణాలను గుర్తించారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు రహదారి భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను బలోపేతం చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై అధికారులు చర్చించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఈ పరిశీలన చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

## కళ్యాణపురి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతిపత్రం

-నిధులు కేటాయించి త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతాం:ఎమ్మెల్యే

బండారి లక్ష్మారెడ్డి హామీ



**ఉప్పల్ :**
చిల్కానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ పురి కాలనీలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ కళ్యాణపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణం అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శాలువాతో ఘనంగా సత్కారం నిర్వహించారు. అనంతరం కాలనీలో నివసిస్తున్న ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ హాల్ ఎంతో అవసరమని ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లో అభివృద్ధి పనులు వేగంగా. కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో దాదాపు 80 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనుల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, సీవరేజ్ పైప్లైన్ల అభివృద్ధి వంటి ముఖ్యమైన పనులు ఉన్నాయని వివరించారు. కళ్యాణపురి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఉప్పల్ బాగాయత్ అభివృద్ధికి వేగం

-త్వరలో ఎంఎంసీ కార్పొరేషన్ భవనానికి సీఎం చేతుల మీదుగా భూమి పూజ.

-రూ.3.10 కోట్లతో ప్రహరీ గోడల నిర్మాణం

- రూ.10 కోట్లతో బహుస్థాయి క్రీడా సముదాయం

-రూ.3.5 కోట్లతో కమ్యూనిటీ హాల్కు ప్రణాళికలు

**ఉప్పల్ :**
ఉప్పల్ బాగాయత్ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉప్పల్ బాగాయత్లో విస్తృతంగా పర్యటించిన ఆయన, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, త్వరలోనే ఉప్పల్ బాగాయత్లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ భవన నిర్మాణం కోసం ఇప్పటికే 10 ఎకరాల స్థలంతో పాటు రూ.100 కోట్ల నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. దీంతో ఉప్పల్ బాగాయత్ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరగడంతో పాటు పరిపాలనా సేవలు ప్రజలకు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. ఉప్పల్ బాగాయత్లో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలను





పరిరక్షించేందుకు రూ.3.10 కోట్ల వ్యయంతో ప్రహరీ గోడల నిర్మాణ పనులు చేపడుతున్నామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రహరీ గోడల నిర్మాణ పనులతో పాటు కొత్తగా ఏర్పాటు చేస్తున్న బోర్వెల్ పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ఉప్పల్ బాగాయత్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న పరమేశ్వర్ రెడ్డి, త్వరలోనే రూ.10 కోట్లతో బహుస్థాయి క్రీడా సముదాయం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే రూ.3.5 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ బాగాయత్ ప్రాంతానికి మౌలిక వసతులు కల్పించడంతో పాటు మిగతా అన్ని రకాల అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ భగాయత్ కాలనీ వాసులు వక్కంటి శ్రీనివాస్ రావు, బిజ్జుల రవీందర్ రెడ్డి, వంశీ చందర్ రెడ్డి, గోనె అర్జున్ రెడ్డి,విశ్వనాథ్, ఈగ సంతోష్ ముదిరాజ్,పూజల ప్రభాకర్,విప్లవ్ రెడ్డి,శివ ప్రసాద్ రావు, రావళి, స్వప్న, సుజాత, సూర్యగోపాల్, చారి, మూర్తి, మనోహర్ రెడ్డి, మహేష్, మురళి, రాఘవేంద్ర రెడ్డి, మల్లికార్జున్, సందీప్, యాదవల్లి రాజు, విప్లవ రెడ్డి, శ్రీనాథ్ రావు, శ్రీధర్ రెడ్డి, వెంకటయ్య పూజల ప్రభాకర్, సల్ల ప్రభాకర్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి, వరకల మదన్ గౌడ్, ఖాజా మౌలానా,అలుగుల అనిల్, వెంకటేశ్, బీమ్ సేన్, ఉపేందర్,నాగి రెడ్డి,లింగ రెడ్డి, తదితరులు. పాల్గొన్నారు.

# కూకట్పల్లి డిపోకు 60 ఎలక్ట్రిక్ బస్సులు

- మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఘన ప్రారంభం

- ప్రజా రవాణాలో కొత్త అధ్యాయం..కాలుష్య రహిత నగర దిశగా కీలక అడుగు...

**కూకట్పల్లి :**
హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దే దిశగా కూకట్పల్లి డిపోకు 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తూ ఘన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 545 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తున్నాయని,




కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 2,200 ఈవీ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నగర పరిధిలో కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను కూడా అదే స్థాయిలో విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, కాలుష్య రహిత, ఆధునిక రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని బండి రమేష్ తెలిపారు. త్వరలోనే పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గిందని, కొత్త బస్సుల కొనుగోలు ద్వారా మహిళలను ప్రజా రవాణా వ్యవస్థలో భాగస్వాములుగా నిలబెట్టామని పేర్కొన్నారు. మహిళల భద్రత, సౌకర్యం, భాగస్వామ్యం పెంపు కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కూకట్పల్లి డిపో విస్తరణలో భాగంగా ఐదు ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చి కూకట్పల్లి ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో కాలుష్య రహిత ప్రజా రవాణా కేంద్రంగా మార్చేందుకు

## అల్ఫాబెట్జ్ ఇంటర్నేషనల్ ప్రీస్కూల్ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**-చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రీ-స్కూల్ విద్యే -- ఎమ్మెల్యే**



**ఉప్పల్:**
జమ్మిగడ్డ జీఆర్ రెడ్డి నగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన అల్ఫాబెట్జ్ ఇంటర్నేషనల్ ప్రీస్కూల్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలను సందర్శించి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది ప్రీ-స్కూల్ విద్యేనని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే పిల్లలకు సరైన విద్యా వాతావరణం, క్రమశిక్షణ,సృజనాత్మకత పెంపొందించే అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఆధునిక సదుపాయాలు, ప్లే వే పద్ధతిలో బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమని కొనియాడారు. ప్లేగ్రూప్, నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులతో పాటు డే కేర్ సౌకర్యాలు అందుబాటులో ఉండటం తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే తెలిపారు. పిల్లల మానసిక వికాసం, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాల అభివృద్ధికి ఇలాంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు చిన్నారుల్లో విలువలు పెంపొందించే దిశగా విద్యాసంస్థలు పనిచేయాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, భద్రతాయుత వాతావరణం, వినూత్న బోధనా పద్ధతులను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి

**-సమాచార శాఖ కమిషనర్కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతిపత్రం**



**ఉప్పల్:**
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమాచార మరియు ప్రజాసంబంధాల శాఖ కమిషనర్ ముకుంద్ రెడ్డి ఐఏఎస్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సమస్యలు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారికి ప్రభుత్వ గుర్తింపు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగర ప్రాంతాల వరకు కష్టపడి పనిచేస్తున్న పాత్రికేయులు సమాజానికి సమాచారాన్ని చేరవేసే వారధిలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాంటి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వ గుర్తింపు, భద్రతతో పాటు పలు సౌకర్యాలు కూడా అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన ప్రతి పాత్రికేయుడికి అక్రిడిటేషన్ కార్డు మంజూరు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ కమిషనర్ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జర్నలిస్ట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర సెక్రటరీగా కొండ్లెపు అర్జున్ నియామకం



**కోరుట్ల :**
టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర సెక్రటరీ గా జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రానికి చెందిన కొండ్లెపు అర్జున్ (మోచి) ని నియామిస్తూ రాష్ట్ర పీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నిన్న డిల్లీలో ఇందిరా భవన్ లో జరిగిన సమావేశంలో ఏఐసీసీ ఎస్సీసెల్ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతం నియామక పత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా కొండ్లెపు అర్జున్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్ర లో ఎస్సీ ఉపకులాలను గుర్తిస్తూ నన్ను రాష్ట్ర సెక్రటరీ గా నియమించడం చరిత్రత్మాకమని అన్నారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ బలోపేతం కోసం కృషి చేస్తునే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు పాటుపడతానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారికి, పీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ కి, 57 వీదూజ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం కి కృతజ్ఞతలు తెలిపారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

**శివాలయ చైర్మన్ మల్లెల నరసింహారావు.**



**అన్నపురెడ్డిపల్లి :**
అన్నపురెడ్డిపల్లి మండల ముస్లిం సోదర సోదరీమణులకు భక్తి శ్రద్ధల తో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన శివాలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, అనంతరం వారు పండుగ ప్రత్యేకత ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ ఈ దుల్ అజ్ హా ప్రార్థనలు సోదర సోదరీమణులు ఒకే చోటకు చేరి పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని ఒకరిని ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకోవటం ఇస్లాం సంప్రదాయం లో చాలా మంచిగా జరుగుతుంది అన్నారు. ఇస్లాం ధర్మాన్ని పాటించే ముస్లింల ప్రధాన పండగలు రెండు ఒకటి రంజాన్ రెండవది బక్రీద్. ఈదుల్ అజ్ హా అని పిలిచే ఈ పండుగ ఇస్లామిక్ క్యాలెండర్ 12 వ నెలైన జుల్ హజ్జాలో వస్తుంది. ఈ నెలలోనే ముస్లింలు హజ్ యాత్రనూ చేస్తారు. రంజాన్ పండుగ జరిగిన 70 రోజుల తరువాత బక్రీద్ వస్తుంది అన్నారు. అల్లాహ్ ఆదేశం ప్రకారం ఇబ్రాహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్ను బలి ఇవ్వడానికి సిద్ధపడతాడు. ఆ సాంప్రదాయాన్ని స్మరిస్తూ ప్రపంచం లోని ముస్లింలు ఈ పండుగను జరుపు కొంటారు అన్నారు. ఈ పండుగ కు ప్రామాణికం ఖురాన్. (ఇరాన్ లో ముస్లింలు దీనిని 3వ అతి ముఖ్యమైన పండుగగా జరుపుకొంటారు.) ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) లో లాగ, బక్రీద్ కూడా ప్రార్థనలు ఖుత్బా (ధార్మిక ప్రసంగం) తో ప్రారంభమౌతుంది అన్నారు. ఇ పండుగ ముస్లింలకు ఎంతో ప్రత్యేకమైంది. త్యాగానికి ప్రతీక గా జరుపుకునే ఈ పండుగ పవిత్రమైన పండుగల్లో ఒకటి. ఈ బక్రీద్ పండుగనే ఖుర్బానా పండుగ లేదా ఈద్ అల్-అధా అని కూడా పిలుస్తారు. రంజాన్ తర్వాత వచ్చే ఇస్లామిక్ క్యాలెండర్ లో ముఖ్యమైన నెలల్లో ఈ నెల ఒకటి అన్నారు. ప్రవక్త ఇబ్రహీం తన కొడుకైన ఇస్మాయిల్ ను కత్తితో మెడను కోస్తున్నట్టుకు ఒక రోజు కళ వస్తే ఆ అల్లాహ్ తన కొడుకునే కోరుతున్నాడేమోనని భావించి తన కొడుకును బలి ఇవ్వడానికి సిద్ధపడతాడు. ఇబ్రహీం త్యాగాన్ని మెచ్చిన అల్లాహ్ ప్రాణ త్యాగం వద్దని ఏదైనా జీవిని బలి ఇవ్వాలని కోరతాడు. ఇబ్రహీం భక్తికి, త్యాగానికి గుర్తుగా ఆయనను సత్కరించేందుకే ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు. అల్లాహ్ కు నైవేద్యం సమర్పించిన తర్వాత గొర్రె పిల్లను మూడు భాగాలుగా చేసి కొంత భాగం కుటుంబానికి, ఇంకొంత భాగం స్నేహితులకు, ఇంకొంచెం పేదలకు, అవసరమైన వారికి పంచి పెడతారు. ఈ మాంసం తో మటన్ కీమ్, మటన్ కుర్మా, మటన్ బిర్యానీ, కీర్, షీర్ కుర్మా వంటి వంటకాలను విందుగా రెడీ చేసి ఆరగిస్తారు అన్ని వారు తెలియ జేశారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-తోపుచర్ల సర్పంచ్ నన్నేబోయిన పార్వతమ్మ పిలుపు**
**-ఘనంగా బాలల పరిరక్షణ కమిటీ సమావేశం**
**- పాల్గొన్న అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు**



**మాడుగులపల్లి :**
మండల పరిధిలోని తోపుచర్ల గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం బుధవారం అంగన్వాడీ టీచర్ చంద్రకళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బాలల సంక్షేమం, బాల్య వివాహాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్గా గ్రామ సర్పంచ్ నన్నేబోయిన పార్వతమ్మ రమేష్, కన్వీనర్గా బట్టు చంద్రకళ, కార్యదర్శిగా పూసపాటి నరేష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నన్నేబోయిన పార్వతమ్మ మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు జరిపించడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలు బాలికల చదువుకు ఆటంకం కలిగించడంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. గ్రామంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూసేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆమె స్పష్టం చేశారు. గ్రామస్థులు, కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండి బాలల హక్కులను కాపాడాలని, ఎక్కడైనా బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలల భద్రత, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు కూడా బాలల సంరక్షణ, ఆరోగ్యం, విద్యపై పలు సూచనలు చేశారు. బాలల సంక్షేమానికి గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త జయమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ ఎలిశమ్మ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఒంటెద్దు సైదిరెడ్డి, రషీద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో 'ఓటిపి' తుగ్లక్ విధానాన్ని రద్దు చేయాలి షేక్ బాబా

- **సాంకేతికత పేరుతో అన్నదాతల పొట్టగొడుతున్న సర్కార్**
- **సర్వర్లు డౌన్.. కొనుగోళ్లు నిల్.. ఐకేపీ సెంటర్లలో రైతుల నరకయాతన**
- **రైతులను దళారుల పాలు జేసేందుకేనా ఈ కుట్ర?**
- **బిజెపి మైనార్టీ మోర్చా జాతీయ నేత తీవ్ర ఆగ్రహం**



**మాడుగులపల్లి:**
రైతులకు ప్రభుత్వం నుంచి అందవలసిన సబ్సిడీ పథకాలు, యూరియా పంపిణీ మరియు వడ్ల కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఓటిపి' (రూపా) నిబంధనను తక్షణమే రద్దు చేయాలని బిజెపి మైనార్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు షేక్ బాబా డిమాండ్ చేశారు సాంకేతికత పేరుతో ప్రభుత్వం రైతులను రోడ్డున పడేస్తోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు బుధవారం నల్గొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత విధానాల వల్ల క్షేత్రస్థాయిలో రైతాంగం తీవ్ర నరకయాతన అనుభవిస్తోందని షేక్ బాబా మండిపడ్డారు ఎండ తీవ్రతకు ఐకేపీ సెంటర్లలో వడ్ల కుప్పల ముందే రైతులు ప్రాణాలు వదులుతుంటే, పాలకులు మాత్రం డిజిటల్ మాయాజాలం చూపిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామీణ ప్రాంతాల్లో సర్వర్లు సరిగ్గా పనిచేయవని, నెట్వర్క్ సిగ్నల్స్ ఉండవనే కనీస జ్ఞానం ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు గంటల తరబడి, రోజుల తరబడి ఓటిపిల కోసం రైతులు మొబైల్ ఫోన్లు పట్టుకుని కొనుగోలు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అని నిలదీశారు ఒకవైపు యూరియా కొరత, మరోవైపు వడ్ల కొనుగోళ్లలో జాప్యం చేస్తూ రైతులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, ఈ ఇబ్బందులు భరించలేక రైతులు తక్కువ ధరకే దళారులకు ధాన్యాన్ని అమ్ముకునేలా ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు వృద్ధులైన రైతుల పేరిట ఉన్న భూములకు, వారి ఆధార్ నెంబర్లకు లింక్ అయిన ఫోన్లు అందుబాటులో లేక కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని వాపోయారు టెక్నాలజీ అనేది పని సులువు చేయడానికి ఉండాలి కానీ, రైతుల ప్రాణాలు తీయడానికి కాదని హితవు పలికారు ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి తక్షణమే కళ్ళు తెరిచి క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను చూడాలని డిమాండ్ చేశారు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓటిపి విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత పద్ధతిలోనే యుద్ధప్రాతిపదికన వడ్లు సేకరించాలని స్పష్టం చేశారు రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్ల ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని షేక్ బాబా హెచ్చరించారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co